



ఈసీ లేదు.. వీసీ లేరు..

- కాకతీయ యూనివర్సిటీకి దిక్కెవరు?
- పాలక మండలి ఏర్పాటులో తాత్సారం
- గత అక్టోబరులోనే ముగిసిన ఈసీ పదవీకాలం
- మే 21న ముగిసిన వైస్ చాన్స్‌లర్ పదవీకాలం
- ఇన్‌చార్జి వీసీ పాలనలోనే వర్సిటీ
- కేయూలో కీలక నిర్ణయాలపై ప్రభావం
- ఈసీ లేకపోవడంతో ఏర్పాటు కాని సెర్చ్ కమిటీ
- కేయూ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని విజ్ఞప్తులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయ యూనివర్సిటీలో పాలన అస్తవ్యస్తంగా మారింది. 8 నెలలుగా పాలక మండలి (ఈసీ), మే 21వ తేదీ నుంచి పూర్తిస్థాయి వైస్‌చాన్సలర్ లేక కేయూలో పాలన గాడి తప్పుతోంది. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఈసీ, వీసీ లేకపోవటంతో వర్సిటీకి సంబంధించిన ప్రధానమైన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీలను నియమించిన ప్రభుత్వం.. కేయూకి మాత్రం ఈసీ లేకపోవటంతో కమిటీ వేయలేకపోయింది. దీంతో కొత్త పాలక మండలి ఎప్పుడు వస్తుందో..? యూనివర్సిటీకి కొత్త వీసీని ఎప్పుడు నియమిస్తారో? అనే ఉత్కంఠతో ప్రొఫెసర్లు, విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

ముగిసిన ఈసీ, వీసీల పదవీకాలం

పైరవీలు, అక్రమాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన కలగానే మారుతోంది. పాలకమండలికి కొత్త కమిటీని నియమించటంలో చేస్తున్న తాత్సారం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోంది. గత అక్టోబరు 22వ తేదీనే కేయూ పాలక మండలి పదవీకాలం ముగి సింది. అక్టోబరు, నవంబరు నెలల్లో ఎన్నికల కోడ్ కారణంగా కొత్త ఈసీలను నియమించటం కుదరలేదు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేస్తామని మాట ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు కనీసం కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీని ప్రభుత్వం నియమించలేదు. దీంతో యూనివర్సిటీలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా, గత నెల 21వ తేదీన కేయూ వైస్ చాన్సలర్ రమేష్ పదవీకాలం పూర్తి అయింది. దీంతో కేయూకు సీనియర్ ఐఏఎస్ అధికారిణి కరుణ ను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. ఇదిలా వుండగా, 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో యూనివర్సిటీలో కొత్త కోర్సుల ప్రవేశ పెట్టడంతో పాటు వేతనాలు, ఉద్యోగ నియామకాలు, కొత్త ప్రాజెక్టుల నిర్వహణకు కావాల్సిన బడ్జెట్‌తో పాటు కేయూ భూముల అక్రమణాలు, వివిధ కమిటీల నివేది కలపై నిర్ణయం తీసుకోవాల్సిన పాలకమండలి, పూర్తి స్థాయి వైస్‌చాన్సలర్ లేకపోవటం సమస్యాత్మకంగా మారింది.

సెర్చ్ కమిటీ కూడా లేదాయే..

కాకతీయ యూనివర్సిటీకి వైస్‌చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభుత్వం సెర్చ్ కమిటీని కూడా నియమించలేదు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులను నియమిస్తారు. వీరిలో ఒకరు ప్రభుత్వం నుంచి, మరొకరు విద్యాశాఖ నుంచి ఉంటారు. ఇంకొకరిని యూనివర్సిటీ పాలక మండలి నుంచి సూచిస్తారు. ఈ ముగ్గురు నేతృత్వంలో సెర్చ్ కమిటీ వైస్‌చాన్సలర్‌ను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తుంది. అయితే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పూర్తి స్థాయి పాలక మండలి ఉన్నప్పుడే సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును ఖరారు చేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే కేయూ నుంచి మాత్రం సెర్చ్ కమిటీ సభ్యుడిని ఎంపిక చేయకుండానే అక్టోబరులో పాలక మండలి పదవీ కాలం పూర్తయింది. గత వీసీ నిర్లక్ష్యంతో సెర్చ్ కమి టీని ఎంపిక చేయలేదని ఆకుట్ సభ్యులు విమర్శిస్తున్నారు.

పాలకమండలి-విధులు

యూనివర్సిటీలో 13మందితో పాలక మండలిని నియమిస్తారు. ప్రతీ యూనివర్సిటీ ఈసీకి వైస్‌చాన్సలర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మిగతా 13మంది సభ్యుల్లో విద్యాశాఖ, ఆర్థికశాఖ, కళాశాల విద్యాశాఖ కమిషనర్, (సాంకేతిక యూనివర్సిటీ అయితే సాంకేతిక విద్యాశాఖ కమిషనర్) ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ఉంటారు. అలాగే యూనివర్సిటీ కాలేజీల నుంచి ఒక ప్రిన్సిపాల్, ఇద్దరు అధ్యాపకులు, డిగ్రీ కాలేజీల నుంచి ఒక ప్రిన్సిపాల్, ఒక అధ్యాపకుడు, సమాజంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను నలుగురిని కలుపుకుని మొత్తం 13మందితో సభ్యులను ప్రభుత్వం నియమిస్తుంది. ఈ కమిటీ తీసుకునే నిర్ణయమే విధానంగా మారుతుంది. యూనివర్సిటీకి సంబంధించిన ఏ పని చేయాలన్న ఈసీ అనుమతి తప్పనిసరి. దానినే వీసీ అమలు చేస్తారు. అంతేకాకుండా అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, ప్రమోషన్స్, ఉద్యోగాల భర్తీ, సైంటిఫిక్ పరికరాలు, ల్యాబ్ వస్తువుల కొనుగోలు, యూజీసీ నిధులు వినియోగం ఇలా అన్నింటికీ ఈసీ ఆమోదం తప్పనిసరి.

దరఖాస్తు చేసుకున్నా..

రాష్ట్రంలోని అన్ని యూని వర్సిటీలకు వైస్‌చాన్సలర్ నియామకం కోసం ప్రభుత్వం జనవరి 27వ తేదీన నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు దర ఖాస్తులను స్వీకరించింది. కాకతీయ యూనివర్సిటీకి 149 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే కేయూకు మినహా మిగతా తొమ్మిది యూనివర్సిటీలకు ప్రభుత్వం ఇటీవల సెర్చ్ కమిటీలను నియమించింది. ఈ సెర్చ్ కమిటీలు వచ్చిన దరఖా స్తులను పరిశీలిం చారు. ఈ నెలఖారు లోగా తొమ్మిది యూనివర్సి టీలకు కొత్త వైస్‌చాన్సలర్‌లను నియమించనున్నారు.

కానీ కాకతీయ యూనివర్సిటీకి మాత్రం ఇన్‌చార్జి వీసీనే దిక్కుగా మారనున్నారనే చర్చ జరుగుతోంది. అయితే కేయూకు కొత్త పాలక మండలి నియామకం తరువాతే సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తారని, ఆ తరువాతనే కొత్త వీసీ వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కాకతీయ యూనివర్సిటీకి పాలక మండలిని నియమించి, వీసీ నియామకం కోసం సెర్చ్ కమిటీని కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.





బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న బాధితులు

కిరాణ వ్యాపారి డబ్బులతో పరార్?

- 150 మంది దగ్గర రూ.10 కోట్ల అప్పు చేసిన గణేష్
- మోసపోయామని బయ్యారంలో బాధితుల ఆందోళన

బయ్యారం, జూన్ 15 : ఓ వ్యాపారి నమ్మించి, మోసం చేసి డబ్బులతో పరారవడంతో బాధితులు ఆందోళనకు దిగిన ఘటన బయ్యారంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం. బయ్యారం మండల కేంద్రంలోని స్థానిక గాంధీ సెంటర్‌లో ఉన్న కిరాణషాపు వ్యాపారి కైరంకొండ గణేష్ కొంత కాలంగా భారీ మొత్తంలో డబ్బులు అప్పుగా తీసుకున్నట్లు సమాచారం. ఒకరి విషయం మరొకరికి తెలియకుండా దాచిపెడుతూ దాదాపు 150 మంది నుంచి సుమారు రూ.10 కోట్లు డబ్బులు అప్పుగా తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కొద్ది రోజులుగా పలువురు బాధితులు ఒకొక్కరిగా ఇచ్చిన అప్పును తిరిగి అడుగుతుండటంతో గణేష్ ఇటీవల ఎవరికీ తెలియకుండా కుటుంబసభ్యులతో గ్రామం నుంచి వెళ్లిపోయాడు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న బాధితులు గణేష్ ఆచూకి కోసం ప్రయత్నించినప్పటికి ఫలితం లేకపోవడంతో న్యాయం కోసం శనివారం రోడ్డెక్కారు. బస్టాండ్ సెంటర్‌లో ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధానరహదారిపై బైటాయించి తమను మోసంచేసి డబ్బులతో ఉడాయించిన గణేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని నినదించారు.

ఈ విషయం తెలుసుకున్న ఎస్సై ఉపేందర్ తన సిబ్బందితో ఘటన స్థలికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. చట్ట ప్రకారం న్యాయం జరిగేటట్టు చూస్తామని ఎస్సై హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు. కాగా, అప్పులు ఇచ్చిన పలువురికి గణేష్ లాయర్ ద్వారా నోటీసులు పంపించినట్లు సమాచారం.



జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మాట్లాడుతున్న భూక్య మురళీనాయక్

వైద్యులు అంకితభావంతో విధులు నిర్వహించాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

నెహ్రూసెంటర్, జూన్ 15 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు అంకితభావంతో పని చేయాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ సూచించారు. శనివారం ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల అంకితభావంతో పని చేసి, నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఉద్యోగులందరూ సమయపాలన పాటించాలని, చక్కటి వైద్యంతో పాటు మంచి ఆరోగ్యవిషయాలపై అవగాహన కల్పించాలన్నారు. డయాలసిస్ విభాగంలో కొత్తగా ఏర్పాటు చేసిన మిషనరీ యంత్రాలపై సమీక్షించారు. నూతన బిల్డింగ్ నిర్మాణానికి, ఆస్పత్రి అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే జిల్లా ఆస్పత్రి వైద్య సిబ్బంది బొకే అందించి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపరింటెంట్ శ్రీనివాస్, ఆర్ఎంవో జగదీష్, వైదేహి, వెంకట్రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానుకోట పట్టణంలోని నందినగర్, గుండ్లకుంట కాలనీ, ఆర్టీసీ కాలనీ, గిరిప్రసాద్‌నగర్, ఎల్‌బీజీనగర్, రాహుల్‌నగర్, కంకరమిల్‌తండా, చిట్యాల గోపయ్యనగర్, ఏటిగడ్డ తండా, రాంచంద్రాపురం కాలనీ, ఆర్టీసీ బస్టాండ్‌రోడ్డు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, స్నేహనగర్, ఆకుల లక్ష్మయ్య కాలనీ, అంబేడ్కర్ కాలనీ, ఈదులపూసపల్లి రోడ్డులలో చెట్లకొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 15 : జిల్లాలో ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు శనివారం తెలిపారు. ఎస్సెస్సీ పరీక్షలకు 589 మంది అభ్యర్థులు హాజరు కాగా, 260 (44.14 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఇంటర్‌లో 747 మంది హాజరు కాగా, 333 (44.58 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. రీకౌంటింగ్ కోసం ప్రతీ సబ్జెక్టుకు పదో తరగతి అభ్యర్థులు రూ.300 చెల్లించాలని, ఇంటర్మీడియట్‌కు రూ.400 చెల్లించాలన్నారు. రీవెరిఫికేషన్ కోసం టెన్త్, ఇంటర్ వారికి ప్రతీ సబ్జెక్టుకు రూ.1200 మీసేవ కేంద్రాల ద్వారా చెల్లించాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 27 వరకు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు ఎసీజీఈ మందుల శ్రీరాములు సెల్ : 9849761012ను సంప్రదించాలన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- గంగారం మండలాభివృద్ధికి పాటుపడాలి
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్



గంగారం ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

గంగారం, జూన్ 15 : అధికారులు సమన్వయంతో పనిచేసి, మండలాభివృద్ధికి బాటలు వేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సూచించారు. శనివారం గంగారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆ యన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందిని కాన్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యురాలు, సిబ్బంది విధులకు హాజరవుతున్నారా! లేదా? అనిఆరాతీశారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించి నిరుపయోగంగా ఉన్న కేజీబీవీ పాఠశాలలో మంచినీటి వసతిని ఏర్పాటు చేసి భవనాన్ని ఉపయోగించుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. అనంతరం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, మండల రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయంను కలెక్టర్ తనిఖీ చేశారు. తర్వాత ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ గంగారం మండలం అన్నివిధాలుగా వెనుకబడి ఉండటంతో కేంద్ర ప్రభుత్వం నీతీ ఆయోగ్ పథకం కింద ఎంపిక చేసిందని వెల్లడించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, పోషకాహారం, మంచినీటీ సరఫరా, రహదారులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పారావు, తహసీల్దారు రాము, నీతీ ఆయోగ్ కోఆర్డినేటర్ శ్రీనాథ్, ఎంపీవో సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు. కాగా, శనివారం వచ్చిందంటే చాలు, మండలానికి చెందిన కొందరు అధికారులు వివిధ సాకులతో విధులకు డుమ్మాకొట్టడం అనవాయితీ. అయితే జిల్లా కేంద్రానికి మారుమూలన ఉన్న గంగారం మండలానికి కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మిక తనిఖీ చేస్తారన్న విషయం తెలుసుకున్న పలుశాఖల అధికారులు ఉరుకులు పరుగులు మీద వారివారి విధుల్లో హాజరు కావటం విశేషం.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొత్తగూడ : విధుల్లో నిర్లక్ష్యం వహించినా, సమయ పాలన పాటించకున్నా చర్యలు తప్పవని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ హెచ్చరించారు. కొత్తగూడలో ఆయన పర్యటించారు. కొత్తగూడలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి, విధులకు గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ఫోన్‌లో ఆదేశాలిచ్చినట్లు తెలిసింది. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. స్పోర్ట్స్ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల వివరాలను తెలుసుకున్నారు. తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డును పరిశీలించారు. అర్జీదారులకు సేవలు అందించాలని, పెండింగ్ భూసమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



ధర్మన్న కాలనీలో సైడ్ డ్రైనేజీ కాల్వలు లేక రోడ్డు వెంట చేరిన మురుగునీరు

శీతకన్ను..

- మానుకోట శివారు కాలనీలపై అశ్రద్ధ
- కనిపించని ప్రగతి.. రోడ్లులేక అవస్థలు
- డ్రెయినేజీ లేక ప్రజలు ఇబ్బందులు
- కానరాని మౌలిక వసతుల కల్పన
- దోమలతో జనం సహవాసం
- కాంగ్రెస్ సర్కారుపైనే అభివృద్ధి ఆశలు

మహబూబాబాద్ టౌన్, జూన్15 : మానుకోట పట్టణ శివారు కాలనీలు సమస్యలతో సతమతమవుతున్నాయి. అభివృద్ధి ఆమెడ దూరంలో ఉన్నాయి. వర్షాకాలం వస్తుందంటేనే స్థానికులు వణికిపోతున్నారు. కొన్నికాలనీల్లో అంతంత మాత్రంగారోడ్లు ఉండగా, మరికొన్ని కాలనీల్లో రోడ్లు సరిగా లేకపోవడంతో బురదలో నడకయాతన తప్పడం లేదు. మరోపక్క డ్రైనేజీ కాల్వల నిర్మాణం జరగక ఇళ్లలో మురికినీరు వచ్చి, రోడ్లపై చేరడం అవి తటాకంలా కన్పిస్తున్నాయి. దోమలు వ్యాప్తిచెంది కాలనీవాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. అరకొర నిధులతో కాలనీల్లో మాత్రం మౌళిక వసతుల కల్పన జరగలేదు. దీంతో శివారు కాలనీల ప్రజలు జిల్లా కేంద్రంలో భాగమైనప్పటికి అభివృద్ధి ఫలాలు వారికి అందడం లేదు. దినదినాభివృద్ధి చెంది మహబూ బాబాద్ జిల్లా కేంద్రంగా ఆవిష్కృతమై ఏనిమిదేళ్లు కావస్తున్నప్పటికి, శివారు కాలనీలు మాత్రం అభివృద్ధి అంతంతే ఉంది. ఎక్కడా వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా కాలనీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మునిసిపాలిటీ, జిల్లా, పార్లమెంటరీ కేంద్రంగా..

మేజర్ గ్రామ పంచాయతీగాఉన్న మహబూబాబాద్ 2009లో నియోజకవర్గాల పునర్విభజనలోపార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రంగా, 2011లో మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా, 2016లో జిల్లా కేంద్రంగా ఆవిష్కృతమైనప్పటికి పట్టణాన్ని ఆనుకుని ఉన్న కాలనీల్లో మాత్రం అభివృద్ధి కనపడడం లేదు. పట్టణం విస్తరించడంతో శివార్లలో 30 సంవత్సరాల కిందటి నుంచి కాలనీలు వెలుస్తున్నాయి. ఆయా కాలనీల్లో రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదలు, పట్టణాల్లో ఇంటి స్థలాలను కొనుగోలు చేసే ఆర్థిక స్తోమతలేని పేదలు గూడు నిర్మించుకుని కూలీ, నాలీ చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. మానుకోట పట్టణం అప్‌గ్రేడ్ అవుతున్నప్పటికి అందుకు అనుగుణంగా శివారు కాలనీల ప్రజల బతుకులు మారడం లేదు. అసలు కాలనీ ప్రజలు జిల్లా కేంద్రంలో ఉన్నామా..? లేక ఎక్కడో మారుమూల ప్రాంతమో.. ఏజెన్సీల్లో ఉన్నా మా..? అనే సందేహాలు తలెత్తుతున్నాయంటే అతిశయోక్తి కాదు. కొన్ని కాలనీల్లో రోడ్లు ఉన్నప్పటికి వర్షంవస్తే రోడ్లన్నీ బురదమయమై కుంటలను తలపిస్తున్నాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు అందులో నుంచే రావాల్సిందే. మరికొన్ని కాలనీల్లో అయితే రోడ్డు మార్గం కూడా లేదు.

కాలనీల సమస్యలు పరిష్కరించాలి

- సమ్మెట రాజమౌళి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, మానుకోట



మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి. పాలకులు మారినా కాలనీ వాసుల బతుకులు మాత్రం మారడం లేదు. కొన్ని కాలనీల్లో రోడ్లు, సైడ్ డ్రైనేజీ కాల్వలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నెంబర్లు కూడ ఇవ్వక పోవడంతో విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు తీసుకో వాలంటే సమస్యలు తలెత్తుతున్నాయి. కాలనీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

మౌళిక వసతులకు నోచుకొని కాలనీలు..

మానుకోట జిల్లా కేంద్రానికి ఆనుకొని సుమారు 60 కాలనీలకు పైగానే వెలిశాయి. సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య కాలంలో పట్టణ శివార్లలో కాలనీలు ఏర్పాటయ్యాయి. పట్టణంలో కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమతలేని నిరుపేదలు కొంతమంది కొనుగోళ్లు చేసుకొని ఇళ్లు కట్టుకొని కాలనీలుగా ఏర్పాటు చేసుకొని ఉంటున్నారు. మరికొంత మంది పేదలు సైతం ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకొని హక్కుపత్రాలు కూడా పొంది అనేక ఏళ్లుగా కాలనీల్లో నివసిస్తున్నారు. మానుకోట పట్టణ శివారులో ఉన్న 60 కాలనీల్లో దాదాపుగా 8 వేల గడప ఉండి 20 వేల మంది జనాభా



ధర్మన్న కాలనీ వీధిలో కంకర తేలిన రోడ్డు

మిగతా 8వ పేజీలో..







నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 15: యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం జరిగే ఈ పరీక్షకు హనుమకొండ జిల్లాలో 11 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 4,730 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుంది. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటలకు జరుగుతుంది. అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జరుగుతుంది. ఉదయం సెషన్‌కు అభ్యర్థులను ఉదయం 9గంటల నుంచే పరీక్షా హాల్‌లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం సెషన్‌కు 2గంటల నుంచి పరీక్షాహాల్‌లోకి అనుమతించనున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం టీజీఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుంది. ఆయా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి వేయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవతసర మెడికల్ ఎమర్జెన్సీ సదుపాయాలు ఉంటాయి. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

నగరంలో 144 సెక్షన్

వరంగల్ క్రైం: సివిల్స్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు గాను ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ అభిషేక్ మోహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని ఆయన పేర్కొన్నారు. ఆదేశాలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.














అప్రమత్తతే ఆరోగ్య ఆయుధం

● వర్షాకాలంలో వ్యాధుల భయం ● వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో నివారణ ● ప్రాథమిక దశలోనే చికిత్స పొందాలి

వరంగల్ మెడికల్, జూన్ 14: రానున్న కాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో నీటి నిల్వలు ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటువ్యాధులు వేగంగా విస్తరించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. కలుషిత నీటివల్ల డయేరియా, అతిసారం వంటి వ్యాధులు విస్తృతంగా వస్తాయి. దీనికి తోడు దోమకాటు కారణంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళిక రచించినప్పటికీ వ్యక్తిగతంగా ఎవరికి వారు కొన్ని నియమాలు తప్పక పాటించాల్సిన అవసరం ఉంది. సమాజ ఆరోగ్యం కోసం సమష్టిగా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.



వైరల్ ఫీవర్ (విష జ్వరం)

వాతావరణంలో మార్పులు, కొన్నిరకాల వైరస్‌ల కారణంగా వైరల్ ఫీవర్ సోకుతుంది. ఇంట్లో ఒకరికి వస్తే మిగతా వారికి కూడా ఈ ఫీవర్ బారిన పడే అవకాశం ఉంది. ఈ జ్వరంలో రోగికి 103 నుంచి 107 ఫారిన్ హీట్ వరకు జ్వరం ఉంటుంది. గొంతు నొప్పి, జలుబు, ఆకలి మందగించడం, తలనొప్పి, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మలేరియా

వర్షాకాలంలో దోమకాటుతో వచ్చే వ్యాధుల్లో మలేరియా ప్రధానమైంది. దోమ కుట్టిన 10 నుంచి 14 రోజులలోపు అది లక్షణాలు బయట పడతాయి. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, ఒంటి నొప్పులు, చలి ఎక్కువగా ఉంటుంది. చెమటలు పట్టడం, కొన్ని సార్లు వాంతులు కూడా వచ్చే అవకాశం ఉంది. జ్వరం వచ్చిన తొలి రోజునే మలేరియాను నిర్ధారించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స పొందకపోతే కాలేయం. కిడ్నీ, గుండె, రక్తనాళాలపై ప్రభావం చూపి రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా పొంచి ఉంది.

డెంగీ

దోమ కుట్టిన వారం తర్వాత ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదిలించలేని పరిస్థితి ఎదురవుతుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి వస్తుంది. కొందరి శరీరంపై పొక్కులు, దద్దుళ్లు వంటివి వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మలవిసర్జన కనిపిస్తాయి. ఈ వ్యాధికారక వైరస్ రక్తంలో ఉత్పత్తి అవుతున్న ప్లేట్‌లెట్స్‌ను తినేస్తుంది. ఫలితంగా రక్తంలో ప్లేట్‌లెట్ సంఖ్య గణనీయంగా తగ్గి అంతర్గత రక్తస్రావం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. నీటిపై ఉండే దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. అందుకే నిలువ ఉంచిన బిందెలను కచ్చితంగా మూతలు ఉంచాలి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు మాత్రమే చికిత్స పొందాలి.

చికున్ గున్యా

డెంగీ కారక దోమకాటుతోనే చికున్‌గున్యా వ్యాధి సోకుతుంది. గున్యా వైరస్ బారిన పడిన వారిని కుట్టిన దోమ మరొకరికి కుట్టడం ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ రకమైన జ్వరం వచ్చి న వారికి ఒంటి నొప్పులు, తీవ్రమైన కీళ్ల నొప్పులు ఉండి కాళ్ల చేతుల్లో వాపులు కనిపిస్తాయి. మూడు నుంచి ఆరు నెలలపాటు ఈ నొప్పులు తగ్గవని వైద్యులు చెబుతున్నారు.

డయేరియా



కలుషిత నీరు, ఆహారం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల దయేరియా సోకుతుంది. వ్యాధిసోకిన వారికి నీళ్ల విరోచనాలు అవుతాయి. రోజుకు నాలుగు నుంచి ఐదుసార్లు విరోచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. అయితే రోగికి రోజులో పది నుంచి 20 సార్లు నీళ్ల విరోచనాలు అవుతాయి. వాంతులు కూడా ఎక్కువగా ఉంటాయి. కలుషితం వల్ల ఈ వ్యాధి సంభవిస్తుంది. కాబట్టి కుటుంబ సభ్యులతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అనారోగ్యాని కి గురయ్యే అవకాశం ఉంటుంది. వ్యాధికి గురైన వారు బాగా నీరసించడం, సురుకు తగ్గిపోయి మాట్లాడలేకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు

డయేరియా సోకిన రోగికి కాసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగించాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ, కొన్ని రకాల శీతల పానీయాలు ఇవ్వాలి. లీటర్ నీటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు కలిపి మూడు నుంచి నాలుగు గంటలకు ఒకసారి తాగించాలి. ఈ సీజన్‌లో సాధ్యమైనంత వరకు బయట ఆహారం తినకుండా ఉండటం మంచిది. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినవద్దు. విరేచనానికి వెళ్లి తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి.

విరోచనాలు

ఫుడ్ పాయిజన్ కారణంగా కొన్ని సమయాల్లో తీవ్రమైన కడుపునొప్పి వచ్చి రక్త విరోచనాలు అవుతాయి. రక్తంతో కూడిన విరోచనాలు కావడంతో రోగి భయపడే ఆస్కారం కూడా ఉంటుంది.

ఇంట్లో దోమలు ప్రబలకుండా చూసుకోవాలి

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గౌతమ్, జనరల్ మెడిసిన్ విభాగం, ఎంజీఎం ఆస్పత్రి



ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. శుభ్రమైన మంచినీటిని మాత్రమే తాగాలి. బయట పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇంట్లో ఆహారం తినే ముందు కాళ్లు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. ఇంట్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి ఆవరణలో పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలలో వర్షం నీరు నిలవడంతో దోమలు పెరుగుతాయి. దోమలు వ్యాప్తి చెందకుండా నివారించగలిగితే వ్యాధులు సోకే అవకాశం కూడా ఉండదు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వనిత

వరంగల్ క్రైం, జూన్ 15: భర్త వేధింపులు తట్టుకోలేక మాలోతు వనిత(36) అనే మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్టేషన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్‌కు చెందిన బానోతు వీరస్వామి తన కూతురు వనితను 2014లో చెన్నరావుపేట టీకే తండాకు చెందిన మాలోతు బన్సీలాల్‌కు ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో రూ.20లక్షల కట్నం, బంగారు ఇచ్చాడు. హైదరాబాద్‌లో రైల్వేలో ఉద్యోగం చేసే బన్సీలాల్ చెడు వ్యసనాలకు అలవాటుపడి భార్య వనితను వేధిస్తున్నాడు. వనితను బన్సీలాల్‌తో పాటు సోదరుడు, అతడి భార్య వేధిస్తున్నారు. ఇటీవల హనుమకొండలోని పుట్టింటికి వచ్చిన వనిత.. ఈనెల 10న చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం హైదరాబాద్ యశోదకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. తన కూతురు మృతికి కారకులైన అల్లుడు, అతడి సోదరుడు, అతడి భార్యపై శనివారం వీరస్వామి సుబేదారి పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్



పుల్ల శ్రీనివాస్



పి. స్వప్న

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: కేయూలో ఇద్దరు పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్‌ను ప్రకటిస్తూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కామర్స్ విభాగంలో 'పెర్ఫార్మెన్స్ ఎవాల్యుయేషన్ ఆఫ్ పవర్ సెక్టార్ ఎ స్టడీ' అనే అంశంపై కేయూ ప్రొఫెసర్ డి.సక్రియ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసిన పుల్ల శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రకటించారు. అలాగే తెలుగులో రావికంటి వసునందన్ వచన రచనలు-సమగ్ర అధ్యయనం అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసిన పి.స్వప్నకు డాక్టరేట్‌ను ప్రకటించారు.

ట్యాక్స్ బార్ పాలక మండలి సభ్యుడిగా పీవీ నారాయణరావు



పీవీ నారాయణరావు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ పాలక మండలి సభ్యుడిగా వరంగల్‌కు చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పీవీ నారాయణరావు నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొజ్జ మధుసూదన్ వెల్లడించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవలను అందిస్తున్న అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం నిరంతం కృషి చేస్తానన్నారు.

భద్రాచలం - వరంగల్ మధ్యనే 'సింగరేణి'

గిర్మాజిపేట, జూన్ 15: వరంగల్ - బల్లార్ష రైల్వే మార్గంలోని ఆసిఫాబాద్ - రేచిణి మధ్య జరుగుతున్న మూడో లైను పనుల్లో భాగంగా ఈ మార్గంలో పలు రైళ్లను పాక్షికంగా రద్దు, దారి మళ్లింపు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే శనివారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా ప్రతీ రోజు భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) నుంచి వరంగల్ మీదుగా బల్లార్ష వెళ్లే సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సోమవారం నుంచి జూలై 6 వరకు భద్రాచలం - వరంగల్ మధ్యే నడుస్తుందని పేర్కొంది. ప్రతీ రోజు మాదిరిగానే సింగరేణి ఉదయం 5.55 గంటలకు భద్రాచలం రోడ్డు నుంచి బయలుదేరి వరంగల్‌కు ఉదయం 8.44 గంటలకు చేరుకుంటుందని తెలిపింది. అలాగే వరంగల్ నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.20 భద్రాచలం రోడ్డు చేరుకుంటుందని పేర్కొంది. హైదరాబాద్ నుంచి కాజీపేట మీదుగా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు నడిచే హైదరాబాద్- సిర్పూర్‌కాగజ్‌నగర్, సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా సిర్పూర్‌కాగజ్‌నగర్ నడిచే సికింద్రాబాద్ - సిర్పూర్‌కాగజ్‌నగర్ రైళ్లు సోమవారం నుంచి జూలై 6 వరకు హైదరాబాద్ - కాజీపేట, సికింద్రాబాద్ - కాజీపేట మధ్యనే నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత బదిలీ

నూతన ఆర్ఎంగా విజయభాను

బాలసముద్రం, జూన్ 15: వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత బదిలీ అయ్యారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ఆర్ఎం శ్రీలత రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, హైదరాబాద్‌లో చార్మినార్ డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయభాను వరంగల్ రీజినల్ మేనేజర్‌గా నియామకమయ్యారు. కాగా, 2022 నవంబరు 18న వరంగల్ రీజినల్ మేనేజర్‌గా శ్రీలత విధుల్లో చేరారు. మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ సేవలు అందించి ప్రజల నుంచి మన్ననలు పొందారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉమ్మడి జిల్లాలో విజయవంతంగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టారు.

టెస్కాబ్ కార్యాలయంలో మార్నేనికి సన్మానం

హనుమకొండ సిటీ, జూన్ 15: తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సన్మానించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత రవీందర్‌రావు తొలిసారిగా శనివారం హైదరాబాద్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణలోని డీసీసీ బ్యాంకుల చైర్మన్లు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వరరావు, కోశాధికారి అభయ్‌కుమార్ తదితరులు మార్నేనికి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

మార్కెట్లో పనుల కోసం టెండర్ల ఆహ్వానం

వరంగల్ వ్యవసాయం, జూన్ 15: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని పలు పనుల నిర్వాహణ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి గుగులోతు రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏనుమాముల మార్కెట్‌లో పల్లికాయ, పసుపు, పత్తి, మిర్చి, ధాన్యం, అపరాల యార్డులతోపాటు లక్ష్మీపురంలోని పాత, కొత్త మోడల్ కూరగాయల మార్కెట్లకు సంబంధించి జూలై 1 నుంచి 2025 మే 31 వరకు యార్డు క్లీనింగ్, పాన్ షాపులు, క్యాంటీన్ నిర్వాహణ, మరుగుదొడ్లకు సంబంధించి టెండర్లను ఆహ్వానించారు.

ఈ పనులు సంబంధించి మార్కెట్ కార్యాలయం పని వేళల్లో రూ.2000 చెల్లించి టెండర్ షెడ్యూల్ జూన్ 18 నుంచి 24 తేదీ వరకు పొందవచ్చని తెలిపారు. జూన్ 26న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు లక్ష రూపాయల ఈఎండీ చెల్లించిన వారివి స్వీకరించబడునని, అదే రోజు సాయంత్రం 3 గంటలకు టెండర్లను తెరువబడుతాయని కార్యదర్శి ప్రకటనలో తెలిపారు.

ప్రజలు మోదీకి తగిన గుణపాఠం చెప్పారు..

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



ధర్మసాగర్ మండల కేంద్రంలో సీపీఐ జిల్లా శిక్షణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి.

ధర్మసాగర్, జూన్ 15: దేశంలోని ప్రజాస్వామాన్ని ఖూనీ చేసి, భారత రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టడం వల్లే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిణ గుణపాఠం చెప్పారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శనివారం జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మోదీ పదేళ్ల పాలనలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి విభిన్నంగా పాలన జరిగిందన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతులకను అణిచివేసి అనేక మందిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపారని తెలిపారు. రైతులు, కార్మికులకు వ్యతిరేక చట్టాలు తెచ్చి ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టారన్నారు. చివరకు తెలంగాణకు రావాల్సిన విభజన హామీలను అమలు చేయకుండా మోసం చేశారన్నారు. దీంతోనే చావుతప్పి కన్ను లొట్టబోయిన విధంగా బీజేపీకి కేంద్రంలో మెజారిటీ రాలేదని తెలిపారు. టీడీపీ, జేడీయూ మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. లోక్‌సభకు ఎన్నికైన వారిలో 259మంది నేరచరిత్ర గల వారు ఎంపీలుగా ఉన్నారని చెప్పారు. మంత్రి వర్గంలో కూడా నేర చరిత్ర ఉన్న వారితో నిండిపోయిందని ఆయన ఆరోపించారు. గతం కంటే ఇండియా కూటమి అధిక సీట్లు గెలిచి కేంద్రంలో ప్రతిపక్షంగా నిలిచిందన్నారు. వామపక్షాలు లేకుంటే ప్రజల మేలుకోరే చట్టాలు వచ్చేవి కావని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇష్టారీతిగా వ్యవరించడంవల్ల ప్రజలు ఇంటికి సాగనంపారని తెలిపారు. ప్రజలను విస్మరించి పాలన చేసిన వారికి ఇక్కట్లు తప్పవని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, రాజమౌళి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో ట్రాన్స్‌ఫర్స్ ఫీవర్

- బదిలీలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఏ ప్రాతిపదికన బదిలీలు చేస్తారో తెలియని పరిస్థితి
- మంచి స్థానం కోసం మొదలైన ముందస్తు పైరవీలు



రాంనగర్, జూన్ 15: రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ఫీవర్ ప్రారంభమైంది. నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో శాఖ ఉద్యోగులు ముందస్తు పైరవీలకు తెరలేపారు. ఏ ప్రాతిపదికన బదిలీలు చేస్తారో ప్రభుత్వం నుంచి స్పష్టత రానప్పటికీ ఎవరి స్థాయిలో వారు పైరవీలకు శ్రీకారం చుట్టారు. సబ్ రిజిస్ట్రార్‌లు ఆర్థిక లావాదేవీలు పుష్కిగా ఉన్నటువంటి స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కింది స్థాయి ఉద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో స్థానం పొందేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం అవిర్భావం తర్వాత పదేళ్ల కాలంలో 2022లో కేవలం సబ్ రిజిస్ట్రార్‌లను ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బదిలీలు చేశారు. కింది స్థాయి ఉద్యోగులను పదేళ్ల నుంచి కదుపలేదు. కింది స్థాయి ఉద్యోగులకు పదేళ్లుగా పదోన్నతులు సైతం కల్పించలేదు. నగర ప్రాంత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహించే వారు అన్ని రకాలుగా లబ్ధి పొందుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేవారు అన్ని రకాలుగా నష్టపోతున్నారు. పదేళ్లుగా బదిలీల కోసం వేచి చూస్తున్న ఉద్యోగులు కోరుకున్న స్థానం కోసం లాబీయింగ్ చేస్తున్నారు.

స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

రిజిస్ట్రేషన్ శాఖ బదిలీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. రెండేళ్ల కిందట సబ్ రిజిస్ట్రార్ల బదిలీలు చేసిన గత ప్రభుత్వం.. 317 జీవో (జోన్ పరిధిలో) ప్రకారం ప్రక్రియ పూర్తి చేసింది. జిల్లాల వారిగా జాబితా తీసుకున్న ప్రభుత్వం.. పోస్టింగ్‌లు కేటాయిస్తూ జీవో జారీ చేసింది. ఈ జీవో ఆదారంగా సబ రిజిస్ట్రార్‌లు భద్రాద్రికొత్తగూడెం జోన్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాల్లో పోస్టింగ్ పొందారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన బదిలీలను తప్పుపట్టినప్పటికీ ఎలా చేయబోతుందనే విషయమై స్పష్టత ఇవ్వలేదు. జీరో సర్వీసు తీసుకుంటుందా? రెండు లేదా మూడు సంవత్సరాల ఒకే స్థానంలో చేసిన సర్వీసును పరిగణలోకి తీసుకుంటుందా? జోన్, మల్టీజోన్ స్థాయిలో బదిలీలు చేస్తుందా? తెలియని పరిస్థితి. గత ప్రభుత్వం చేసినట్లు బదిలీల స్థానం కేటాయించి జీవో ఇస్తుందా? అనే ఆందోళన ఉద్యోగుల్లో ఉంది. ఒక వేళ మల్టీ జోన్ తీసుకుంటే గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్‌లో కొమురంభీం, అసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం జోన్‌ల పరిధిలోని జిల్లాలకు బదిలీ అవుతారు. నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయనున్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యోగుల వివరాల జాబితా సైతం తీసుకోలేదు. దీనితో అసలు ఈ శాఖలో బదిలీలు జరుగుతాయా? లేక మినహాయింపు ఇస్తారా అనే అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

పోస్టింగ్‌ల కోసం ముందస్తు లాబీయింగ్

శాఖ ఉద్యోగులు మంచి పోస్టింగ్ కోసం ముందస్తు లాబీయింగ్ ప్రారంభించారు. జీరో సర్వీసుతో నేరుగా పోస్టింగ్ ఆర్డర్స్ వస్తాయనే ప్రచారం సాగుతుండటంతో పైరవీలు ముమ్మరం చేశారు. జోన్, మల్టీజోన్‌పై స్పష్టత రాకపోవడంతో ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్‌లు ఆర్థిక లావాదేవీలు అధికంగా ఉండే పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బెటర్ స్థానం దక్కించుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యే వద్ద పడిగాపులు కాస్తున్నట్లు సమాచారం. బెటర్ పోస్టింగ్ కోసం ఎంతైనా ముట్టచెప్పేందుకు సిద్దమైనట్లు తెలిసింది. కాగా జీరో సర్వీసును పరిగణలోకి తీసుకుని బదిలీలు జరిగితే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 13 కార్యాలయాల పరిధిలో అన్ని క్యాడర్‌లకు చెందిన 96మంది (40 జూనియర్ అసిస్టెంట్లు, 21 అటెండర్లు, 3 క్యాషియర్లు, 1 టైపిస్టు, 14 సీనియర్ అసిస్టెంట్లు,14 సబ్ రిజిస్ట్రార్‌లు, 2 డీఆర్‌లు, 1 డీఐజీ) స్థాన చలనం చెందే అవకాశం ఉంది.

శీతకన్ను..

(5వ పేజీ తరువాయి)

నివసిస్తున్నారు. మేజర్ గ్రామపంచాయతీ నుంచి ఆ కాలనీల అభివృద్ధిపై ఎవ్వరూ శ్రద్ధ కనబర్చడం లేదు. అంతర్గత రోడ్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయం, డ్రైనేజీ సమస్యలు ఆయా కాలనీలను వెంటాడుతున్నాయి. మునిసిపల్ పరిధిలో సుమారు 12వార్డుల పరిధిలోకి శివారుకాలనీల ప్రజలు వస్తారు. అయితే ఆయా వార్డు కౌన్సిలర్లకు వచ్చిన నిధులతో కొంతమేరకు రోడ్లు, సైడ్‌కాల్వల నిర్మాణం జరిగిందే తప్ప ప్రజలకు కావాల్సిన మౌళిక వసతులు కల్పించలేదు పోయారు. కొన్ని కాలనీలకు మట్టిరోడ్డు సౌకర్యం ఉన్నప్పటికి అవి చిన్నపాటి చిరుజల్లులకే బురదమయమవుతున్నాయి. కొన్ని కాలనీలకు మిషన్ భగీరథ పైపులైన్‌లేక తవ్విన బావుల నుంచే నీరు సరఫరా అవుతోంది. ఇక వేసవి కాలమైతే వారి నీటిగోస అంతాఇంతా కాదు. శివారు కాలనీల సమస్యలను పరిష్కరించాలని వామపక్ష పార్టీలు సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీలు అనేకమార్లు మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నాలు చేపట్టి అధికారులకు, పాలకులకు వినతి పత్రాలు అందించారు. ఐనప్పటికి కాలనీల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు.

జిల్లా కేంద్రానికి మెరుగులు సరే.. కాలనీల పరిస్థితేంటి?

మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా ఆవిష్కృతం కావడంతో పట్టణానికి మెరుగులు దిద్దారు. ప్రధాన కూడళ్ల రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, జంక్షన్‌లను అభివృద్ధి చేశారు. జిల్లా కేంద్రం శివారు కాలనీలో అభివృద్ధికి ఆమడదూరంలో నివసిస్తున్న నిరుపేదల పరిస్థితి ఏమిటనే సందేహాలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధుల్లో అత్యధికంగా పట్టణం సుందరీకరణకే అధిక ప్రాధాన్యతనిచ్చారు. నాలుగు దశాబ్దాల నుంచి కాలనీల్లో నివసిస్తూ మౌళిక వసతులకు నోచుకోకా ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వరాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడుతాయని ఆశపడ్డ కాలనీవాసులకు నిరాశే ఎదురుకాగా కనీసం జిల్లా ఏర్పాటుతోనైనా తమ బతుకుల్లో వెలుగులు నిండుతాయని ఆశ అడియాశలైంది. ఇక రాష్ట్రంలో పదేళ్ల తర్వాత కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే, ఎంపీ కాలనీల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి స్లమ్ ఏరియా అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి తమ బతుకుల్లో వెలుగులు నింపాలని శివారు కాలనీ వాసులు వేడుకుంటున్నారు. ఆదిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి కాలనీల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



మానుకోట మునిసిపల్ కార్యాలయం ఎదుట తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న శివారు కాలనీవాసులు

'విద్యారంగంలో మార్పులకు సర్కారు శ్రీకారం'

తొర్రూరు రూరల్, జూన్15 : కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోనే సర్కారు పాఠశాలలను బలోపేతం చేస్తూ.. విద్యారంగంలో సమూలమైన మార్పులు చేయడానికి శ్రీకారం చుడుతున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. జయశంకర్ బడిబాట కార్యక్రమానికి హరిపిరాల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై నోటు పుస్తకాలు, దుస్తులు అందజేసి చిన్నారి విద్యార్థులకు అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే పాఠశాలలు ప్రారంభమైన రోజునే దుస్తులు, పుస్తకాలు అందజేయడం మొదటిసారి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, మెరుగైన సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి 73 రకాల పనులు గుర్తించి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని అందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సకల సౌకర్యాలను సమకూరుస్తున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, మునిసిపల్ చైర్మన్ రామచంద్రయ్య, ఎంపీడీవో సిలార్ సాహెబ్, ఎంఈవో రాము, ఎంపీవో గౌస్, నోడల్ ఆఫీస్ బుచ్చయ్య, హెచ్ఎం బి.వెంకటేశ్వర రావు, ఎంపీటీసీ వల్లపు గోపమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు సంతోష్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మల్లీశ్వరి పాల్గొన్నారు.



బడిబాటంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

పేద ప్రజలకు అండగా ప్రభుత్వం

● తొర్రూరు : రాష్ట్రంలో పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో తొర్రూరు, పెద్దవంగర మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. పంద్రాగస్టులోపు సీఎం రేవంత్ రెడ్డి రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేస్తారని తెలిపారు. వివిధ పనులు, కారణాలతో కార్యాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి సమీక్షించారు. అలాగే మునిసిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కాం ట్రాక్టు బిల్ కలెక్టర్‌లు ఉద్యోగ భద్రత కల్పించాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వినతిపత్రం అందించారు. సందర్భంగా కాం ట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు వెంకట్రాంనర్సయ్య మాట్లాడారు. ఇటీవల జీలుగ విత్తనాల అవకతవకల్లో సస్పెన్షన్‌కు గురైన ఏఈవోలు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సంతోష్, సోమ రాజశేఖర్, ముద్దసాని సురేష్, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

22న హైదరాబాద్‌లో హెచ్‌సీఏ టాలెంట్ హంట్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 15 : హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో ఈనెల 22న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో ఫాస్ట్‌బౌలర్ల కోసం టాలెంట్ హంట్ నిర్వహించనున్నట్లు మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఇన్చార్జి బి.అజయ్‌సారథిరెడ్డి శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వర కు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమయొక్క పేర్లను వెబ్‌సైట్ గిగిగిజిఆటజీభిజ్బూజీ నందు నమోదు చేసుకోవాలన్నారు. ఇందులో పేర్లు నమోదు చేసుకునే క్రీడాకారులు గతంలో ఇండి యా జట్టులో కానీ హైదరాబాద్ జట్టులో కానీ ఆడి ఉండకూదన్నారు. ఇవీ కేవలం కొత్త వారికి మాత్రమే అన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నెంబర్ : 98852 67524, 9398364687 లను సంప్రదించాలన్నారు.

'కల్తీ నారు అమ్మితే పీడీయాక్టులు'

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూన్ 15 : రైతులకు కల్తీ నారు అమ్మితే పీడీయాక్టులు నమోదు చేస్తామని, చట్టప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని జిల్లా ఉద్యానపట్టుపరిశ్రమ అధికారి జినుగు మరియన్న నర్సరీల యాజమానులను హెచ్చరించారు. కురవి, సీరోలు, డోర్నకల్ మండలాల్లోని మిర్చి నర్సరీలను శనివారం ఆయన పరిశీలించారు. అలాగే పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైసెన్స్‌లు లేకుండా నర్సరీలను నిర్వహించరాదని, ప్రభుత్వ ఆమోదం పొందిన కంపెనీల నుంచి మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి పెంచాలన్నారు. నర్సరీల చట్టం ప్రకారమే నిర్వహించాలని, ప్రతీ నర్సరీలో ఇన్‌సెట్ ప్రూఫ్ నెట్ వాడాలని సూచించారు. డబుల్ డోర్ పెట్టాలని, పేరుగాంచిన బ్రాండెడ్ రకాల మొక్కలను మాత్రమే పెంచి రైతులకు విక్రయించాలన్నారు. అలాగే పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటలసాగు వైపు రైతులు దృష్టిమళ్లించాలని, ఆయిల్‌పామ్ తోటలకు బిందుసేద్యంతో నీటిని సరఫరా చేసుకోవాలన్నారు. అయిల్‌పామ్ సాగు చేయడం వల్ల ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం సాధించవచ్చునని, అయిల్‌పామ్ సాగు చేసుకోవాలని సూచించారు. మల్యాల ఉద్యాన పరిశోధన స్థానం, ఉద్యాన కళాశాల, కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలతో పంటల సాగుపై సాంకేతిక సలహాలు రైతులకు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి అనితశ్రీ, బిందుసేద్య కంపెనీ ప్రతినిధులు శరత్, ఆగస్టిన్, అయిల్‌ఫెడ్ అధికారి నాగరాజు, రైతులు వేణుగోపాల్‌రెడ్డి, వరదరెడ్డి, శివాలాల్, ఖాజా పాల్గొన్నారు.

జడ్పీహెచ్‌ఎస్ కంబాలపల్లికి రూ. 10 వేల విరాళం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 15 : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పాఠశాలలో 13 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు ఎనమంనగండ్ల శ్రీధర్ రూ.10 వేల విరాళం అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్‌బాబు శనివారం తెలిపారు. స్థానిక పాఠశాలలో శనివారం తన తండ్రి విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లేశం జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను కొనుగోలు చేసేందుకు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. తన తండ్రి జ్ఞాపకార్థం రూ. పదివేల విరాళం అదజేసిన శ్రీధర్‌ను ఉపాధ్యాయులు విష్ణువర్ధన్, ఉప్పలయ్య, సోహెన్, శ్రీధర్‌రెడ్డి అభినందించారు.

'బాలికను హత్య చేసిన వారిని శిక్షించాలి'



మరిపెడలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘాల బాధ్యులు

మరిపెడ, జూన్ 15 : హైదరాబాద్‌లోని మియాపూర్ ఏటిగడ్డతండా దగ్గర నివాసం ఉంటున్న ఓ నిరుపేద కుటుంబానికి చెందిన గిరిజన బాలికపై ఈనెల 7న అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను ప్రభుత్వం గుర్తించి, కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి హరి నాయక్ డిమాండ్ చేశారు. శనివారం రాత్రి మరిపెడ మునిసిపల్ కేంద్రంలో పలు గిరిజన సంఘాల బాధ్యులు ఆ బాలిక మృతిపట్ల కొవ్వొత్తులతో శాంతిర్యాలీ నిర్వహించి, స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ దగ్గర నేషనల్ హైవేపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా హరినాయక్ మాట్లాడారు. ప్రభుత్వం నిందితులను త్వరతగతిన గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని సర్కారు అన్ని రకాల ఆదుకోవాలన్నారు. లేనట్లయితే గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కిషన్‌నాయక్, దేవానాయక్, అనిత, వీరన్న, లక్ష్మాతండా గిరిజనులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలి

● ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి



ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ, అంగన్‌వాడీ ఉద్యోగులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథి రెడ్డి మాట్లాడుతూ.. మహబూబాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కేసముద్రం, మానుకోట మండలాలు, తొర్రూరు ప్రాజెక్టు పరిధిలో నెల్లికుదురు, గూడూరు ప్రాజెక్టు పరిధిలోని గూడూరు మండలాలు, మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయని, వాటిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలాన్ని కేటాయించి భవనాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, పెరుగుకుమార్, శ్రావణ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు మహమూదా, పి.వరలక్ష్మి పాల్గొన్నారు.

'జీపీ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి'



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు, జీపీ సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ అనుబంధ జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట శనివారం జీపీ సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత 18 నెలలుగా గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడం దారుణమని, దీంతో వారంతా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా జీపీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు అందించి వారిని ఆదుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, కుమ్మరికుంట్ల నాగన్న, యూనియన్ జిల్లా కార్యదర్శి బండ్ల అప్పిరెడ్డి, సుధాకర్, మొయినుద్దీన్, లతీఫ్, వెంకన్న, యాకయ్య, జానిమియా, కనకలక్ష్మి, శిరీష, చంద్రకళ, వెంకటేశ్వర్లు, సురేష్, వీరన్న, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు ఐలయ్య మృతి

ఇనుగుర్తి, జూన్ 15 : మాజీ ఎంపీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు దీకొండ ఐలయ్య (70) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొద్ది సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక నాయకుడిగా పని చేసి ఎంతోమందికి ఆయన సేవలందించారు. ఐలయ్య మృతి వార్త తెలుసుకున్న మానుకోట మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, బండి పుల్లయ్య, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి విజయసారథి, మండల కాంగ్రెస్ అధక్షుడు కూరెల్లి సతీష్, పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్నలు ఐలయ్య మృతదేహం వద్ద పూలమాలవేసి నివాళ్లర్పించారు. మాజీ సర్పంచ్ దార్ల రామ్మూర్తి, బేతమల్ల చంద్రయ్య, జిల్లా కాంగ్రెస్ ఎలక్షన్ కోఆర్డినేటర్ తమ్మడపల్లి కుమార్, గుజ్జునూరి బాబు రావు, చిన్నాల కట్టయ్య, బొబ్బిలి మహేందర్‌రెడ్డి, మామిడి శోభన్, జాటోతు హరిచంద్, బానోత్ రామన్న, గండు రాజు పాల్గొన్నారు.

ఇనుప సంకల్పం.. అయస్కాంతంతో జీవన పోరాటం

● మట్టిలో ఇనుప ముక్కల సేకరణతో భృతి



కేసముద్రం, జూన్ 15 : మనిషి అవసరాల్లోంచే ఆలోచనలు పుడుతాయంటారు...బడుగులకు బతకడమే నిత్య పోరాటం...జీవించేందుకు ఏదో ఒక పనిచేస్తుంటారు. ఇందులో భాగంగా వృధాగా మట్టిలో కలిసి ఉన్న ఇనుప ముక్కలను సేకరించి విక్రయిస్తూ జీవిస్తున్నారు కొందరు. కేసము ద్రం స్టేషన్‌లోని ఓ వెల్డింగ్ షాపు ముందు శనివారం ఇద్దరు యువకులు తమ వద్దనున్న అయస్కాంతంతో ఇనుప ముక్కలు సేకరించారు. అక్కడే ఒక మట్టికుప్ప కనిపించగా వదిలివెళ్లకుండా సుత్తితో దాన్ని పెకిలించి అందులోంచి ఇనుమును సేకరించుకొని వెళ్లారు. ఎవరినీ చేయిచాచి అడుక్కోకుండా వృధాగా మట్టిలో ఉన్న ఇనుప ముక్కలను సంకల్పంతో సేకరించి విక్రయించి సొమ్ము చేసుకుంటున్న యువకుల జీవన విధానాన్ని పలువురు ఆసక్తిగా పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సీరోలు, జూన్ 15 : సీరోలు మండలం కొత్తూరు (సీ) గ్రామ పరిధిలోని గుజిలీతండా మహబూబాబాద్-మరిపెడ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిసిన వివరాల ప్రకారం. గుజిలీతండా ప్రధాన రహదారిపై కొత్తూరు (సి) గ్రామానికి చెందిన నవీన్, వంశీ అనే ఇరువురు యువకులు బైకుపై కురవి నుంచి గ్రామానికి వెళ్తున్న క్రమంలో గేదెను ఢీ కొట్టగా గేదె అక్కడిక్కక్కడే మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న తండావాసులు ప్రమాద స్థలానికి చేరుకొని చూస్తుండగా మరిపెడ నుంచి కురవి వైపు వస్తున్న ఆటో చనిపోయిన గేదెను ఢీకొని ఆటో బోల్తా పడి అక్కడే ఉన్న జాటోతు తులస్యాకు మీదికి దూసుకుపోగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది తులస్యా ను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గాయ పడిన నవీన్, వంశీలను ఓ ప్రైవేటు వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తండావాసులు పేర్కొన్నారు. కాగా, తులస్యా పరిస్థితి విషమంగా ఉన్నట్లు 108 సిబ్బంది తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

మరిపెడ, జూన్ 15 : విద్యుత్ ప్రమాదాలపై అధికారులు, ట్రాన్స్‌కో సిబ్బంది ఎప్పటికప్పుడు హైఅలర్ట్‌గా ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలని ట్రాన్స్‌కో టెక్నికల్ డీఈఈ సునీత సూచించారు. శనివారం ఆమె మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని స్థానిక విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ ప్రమాదాలపై అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షకాలం ప్రారంభమైనందున విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఊరూరా ప్రజలను జాగ్రత్త పర్చాలన్నారు. ఏడీఈ లోకనాథ్‌రెడ్డి, ఏఈ పావనీ, సబ్ ఇంజనీర్ మహమూద్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, సిబ్బంది ఉన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

చిన్నగూడూరు, జూన్ 15 : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందని ఎంపీడీవో రామారావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఎకో క్లబ్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా అధికారులు పాఠశాల అవరణలో మొక్కలు నాటారు. ఎంపీవో యాకయ్య, ఏపీవో మాధవి, హెచ్ఎం రెహమాన్, సుగుణాకర్, నాగేశ్వరరావు, సతీష్ పుష్పలీల, సోని, నాగుల్‌మీరా, శ్రీలత, విద్యార్థులు ఉన్నారు.

'నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసు చేస్తాం'

కొత్తగూడ, జూన్ 15 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అభిమన్యుడు హెచ్చరించారు. కొత్తగూడలో పలు విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్ దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఏడీఏ లక్ష్మీనారాయణ, ఏవో ఉదయ్, ఏఈవోలు పాల్గొన్నారు.

● గంగారం : మండలంలోని విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్ దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అభిమన్యుడు తనిఖీ చేశారు. దుకాణ యజమానులు పాటించవలసని నిబంధనలను సూచించారు. ఏడీఏ లక్ష్మీనారాయణ, ఏవో ఉదయ్, ఏఈవోలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● సీపీఎం మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య

మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : మహిళలు ఎందులో తక్కువ కాదని, అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా రాణించాలని సీపీఎం మునిసిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. మహబూబాబాద్‌లోని దైవకృప వెల్ఫేర్ సొసైటీలో ఆరోబ్యాచ్ కుట్టుమిషన్ శిక్షణను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ఆర్థికంగా కుటుంబానికి చేదోడువాదోడుగా నిలబడే విధంగా కుట్టుమిషన్ దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, దైవకృప వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు బానోత్ లోకేష్, వీరన్న, ఉప్పలయ్య పాల్గొన్నారు.

'కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి'



కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న మునిసిపల్ కార్మికులు

మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ పద్ధతిలో పని చేస్తున్న మునిసిపల్ కార్మికులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు తోట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్‌పే పద్ధతిలో పని చేస్తున్న మునిసిపల్ కార్మికులకు జీవో నెంబరు 60, 63 ప్రకారం కేటగిరిల వారీగా ప్రభుత్వం వేతనాలు చెల్లించాలన్నార. కనీస వేతనం నెలకు రూ.26 వేలు అందించాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, పార్నంది కృష్ణ, కాగితపు శ్రీను, ఆకారపు విజయ్, పుచ్చకాయల ఎల్లయ్య, ఆవుల వెంకన్న, టి.రజనికుమార్, జి.పుష్పరాజ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు

మహబూబాబాద్ టౌన్, జూన్15 : మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని శనిగపురం ఊరికి దక్షిణాదిన కొండపై వెలిసిన శ్రీవేట వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు పడి పాడి పంటలుసమృద్ధిగా పండాలని స్వామివారిని వేడుకున్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని నారికేళాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామారాజు మాట్లాడుతూ శ్రీదేవి భూదేవి సమేత శంకచక్రదారియై కొండపై వెలిసిన వేంకటేశ్వరస్వామి భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, రామారాజు సాగర్, చిట్టిమల్ల శ్రీమాన్, ఉపేందర్, రాంరాథోడ్, పద్మం గోపన్న, రామారాజు మేనక, అర్చకులు అశోక్, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : మహబూబాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఆయన జన్మదిన కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రతిపక్షనేతగా మల్లు భట్టి విక్రమార్క తెలంగాణ కోసం అనేక పోరాటాలు చేశారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఆయన విశేష కృషి చేశారని చెప్పారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాగంటి సందీప్ పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం : డిప్యూటీ సీఎం బట్టివిక్రమార్క జన్మదిన వేడుకలను బయ్యారంలో కాంగ్రెస్ నేతలు జరుపుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నేతలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కంబాల ముసలయ్య, జిల్లా కార్యదర్శి ముల్కూరి వీరారెడ్డి, ఎస్టీ మండడవల అధ్యక్షుడు భూక్య రవినాయక్, నాయకులు మోహన్ రావు, విష్ణు, సాంబశివ రావు, శ్రీను, బత్తిని రాంమూర్తి నాగేశ్వరరావు, బిక్షం, ఆరుణ్ పాల్గొన్నారు.

కంబాలపల్లిలో చక్రి జయంతి



చక్రి విగ్రహానికి నివాళ్లర్పించి, మాట్లాడుతున్న మున్నూరుకాపు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

మహబూబాబాద్ రూరల్, జూన్ 15 : మహబూబాబాద్ మండలం కంబాలపల్లిలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో దివంగత సినీ సంగీత దర్శకుడు చక్రి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కంబాలపల్లిలో చక్రి విగ్రహానికి మున్నూరుకాపు సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి పిట్టల శ్రీకాంత్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ సినీ పరిశ్రమలో సంగీత దర్శకుడిగా చక్రిసాధించిన విజయాలు మానుకోటకు గర్వకారణమన్నారు. మానుకోట ప్రాంతం నుంచి సంగీతసాగరంలో అచెలంచెలుగా ఎదిగారని పేర్కొన్నారు. అతని చేసిన పాటలు యువతను నేటికి ఊర్రూతలూగిస్తున్నాయని పేర్కొన్నారు. కంబాలపల్లి సత్యనారాయణ, పిట్టల చంద్రశేఖర్, రావిశెట్టి చంద్రశేఖర్, చిరంజీవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి'

మహబూబాబాద్ టౌన్, జూన్ 15 : మహబూబాబాద్ - ఇల్లందు రోడ్ సమీపంలోని ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 287లో గుడిసెలు వేసుకున్న గౌతమి బుద్ధ కాలనీ పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సురుగు ఐలయ్య విజ్ఞప్తి చేశారు ఈ మేరకు మహబూబాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వినతి పత్రాన్ని అందించారు. కాలనీ వాసులు శ్రీరాములు, ఏసుపాదం, కుమారస్వామి, శ్రీనివాసచారి, విజయ, యాకయ్య, సాయిలు, రజిత, శ్రీను, వెంకన్న, నాగాచారి, కళావతి, రమ, శ్రీరాములుపాల్గొన్నారు.

సాదాబైనామ దరఖాస్తులను పరిష్కరించాలి

గార్ల, జూన్ 15 : తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని తెలంగాణ గిరిజన సంఘం అధ్యక్షుడు భూక్య హరినాయక్ డిమాండ్ చేశారు. సాదాబైనామా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ- తహసీల్దార్ కె.రవీందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. రైతులు శ్రీనివాస్, రమేష్, యాదయ్య, పూల్‌సింగ్ పాల్గొన్నారు.

'నీట్' అవకతవకలపై విచారణ చేపట్టాలి

మహబూబాబాద్ రూరల్,జూన్ 15 : వైద్యరంగంలో డాక్టర్స్ అర్హత పరీక్ష కోసం నిర్వహించే నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న, సహాయ కార్యదర్శి రవి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జూన్ 4న విడుదల చేసిన నీట్ ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని, కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. 25 లక్షల మంది వైద్య విద్యార్థులు ఎంతో కష్టపడి నీట్ పరీక్ష రాస్తే అందులో అవినీతి అక్రమాలు జరగడం విచారకరమన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్ ప్రధాన రహదారిపై నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చరణ్, చంటి, వేణు, రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

మరిపెడ రూరల్, జూన్ 15 : హైదరాబాద్‌లోని మియాపూర్‌లో అభం శుభం తెలియని గిరిజన బాలికను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ గిరిజన జిల్లా కార్యదర్శి హరినాయక్ డిమాండ్ చేశారు. శనివారం ఎల్లంపేట శివారు లక్ష్మా తండా జీపీలో మృతి చెందిన బాలిక వసంత(12) తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 7న వసంత చాక్లెట్ కోసమని దుకాణం వద్దకు వెళ్లిందన్నారు. బాలిక తల్లిదండ్రులు ఎంతకు ఇంటికి రాకపోయేసరికి పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. చివరికి శుక్రవారం చెత్తకుప్పల వద్ద ఓ పాపను అత్యాచారం చేసి, హత్య చేసి తగలబెట్టిన దృశ్యం కొంతమంది చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. గిరిజన బాలికను అత్యాచారం చేసి హత్య చేసిన దుండగలను కఠినంగా శిక్షించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ నాయకులు కిషన్, దేవానాయక్, అనిత, వీరన్న పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తగూడ, జూన్ 15 : ఈనెల 19న ములుగు మండలం ఇంచెర్లలోని ఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు. జాబ్‌మేళాలో విప్రో, ముత్తూట్ గ్రూప్స్, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, ఆక్సిస్ బ్యాంక్ వంటి 58 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటారని సీతక్క పేర్కొన్నారు. 7వతరగతి నుంచి డిగ్రీ, వృత్తి విద్య కోర్సులు చేసిన నిరుద్యోగులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వసంత కుటుంబానికి గోర్‌సేన పరామర్శ

నెహ్రూసెంటర్, జూన్ 15 : హైదరాబాద్‌లోని మియాపూర్‌లో మృతురాలు బాలిక వసంత కుటుంబాన్ని మహబూబాబాద్ గోర్‌సేన జిల్లా అధ్యక్షుడు లావుడ్య హరిలాల్‌నాయక్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు సకాలంలో పట్టించుకుంటే వసంత మృతి చెంది ఉండకపోయేదని అన్నారు. గోర్‌సేన నాయకులు బానోత్ సురేష్‌నాయక్, బోడ వీరన్న నాయక్, అజ్మీర నవీన్‌నాయక్, భూక్య సాగర్‌నాయక్ ఉన్నారు.

వానలు కురువాలని మహిళల పూజలు



మైలారంలో నీటితో పూజలు చేస్తున్న మహిళలు

కొత్తగూడ, జూన్ 15 : వానలు పడాలని కోరుతూ శనివారం మైలారం తండా వాసులు ప్రత్యేక పూజలు చేశారు. దుర్గమ్మ గుడివద్ద ప్రత్యేక పూజలు చేశారు. నీటిలో తడుస్తూ సంప్రదాయ నృత్యాలు చేశారు. వానదేవుడు వర్షాలను కురిపించాలని కోరుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నారు.

వాసవీక్లబ్ సేవలపై ప్రపంచస్థాయి ప్రశంసలు

● వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న బ్రహ్మానందం

మరిపెడ, జూన్ 15 : వాసవీక్లబ్ సేవలపై ప్రపంచస్థాయిలో ప్రశంసలు కురిపిస్తున్నారని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి బ్రహ్మానందం అన్నారు. శనివారం సాయంత్రం మరిపెడ వాసవీ, వనిత క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాన్ టు డస్క్ ప్రోగ్రాంకు ఆయన హాజరై పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, స్టేషనరీ కిట్స్, స్ట్రీట్ వెండర్స్‌కు గొడుగులు, నిరుపేద ఆర్యవైశ్య కులస్థుడికి నాలుగు చక్రాల బండిని అతని జీవనోపాధి కోసం ఉచితంగా అందచేశారు. అనంతరం మరిపెడ ఎస్సై సంతోశ్‌ను సన్మానించారు. క్లబ్ కేసీజీఎఫ్ గుమడవెల్లి నారాయణ, స్థానిక క్లబ్ బాధ్యులు గర్రెపల్లి వెంకన్న, విజయ్‌కుమార్, బోనగిరి సురేశ్, వంగవీటి భద్రయ్య, భరత్, జానకీరాములు, నాగయ్యపాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

డోర్నకల్, జూన్ 15 : తహసీల్దార్ కార్యాలయంలో శనివారం తహసీల్దార్ చేతుల మీదుగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను 14 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. నిరుపేద యువతుల వివాహానికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అందజేస్తుందన్నారు. మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, వైస్ ఎంపీపీ తుమ్మ వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామ పాల్గొన్నారు.